క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్


బాధ్యతలు చేపట్టిన సర్వర్

కన్నాయిగూడెం: నూతన తహసీల్దార్‌గా సర్వర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని తహసీల్దార్‌గా పనిచేసిన వేణు గోపాల్ బదిలీపై వెంకటపురం (కె) మండలానికి వెళ్లగా కన్నాయిగూడెం తహసీల్దాగా సోమవారం సర్వర్ బాధ్యతలు చేపట్టారు.

అయోడిన్‌పై అవగాహన


ఉప్పుపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఈఓ వేణుగోపాలకృష్ణ

వాజేడు : మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో సోమవారం పేరూరు వైద్య సిబ్బంది అయోడిన్ వలన కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఈఓ వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ మనిషి శరీరంలో ఉప్పుశాతం తగ్గితే ఆరోగ్య పరంగా ఎలాంటి రుగ్మతలు వస్తాయో తెలిపారు. అదే సమయంలో తక్కువగా ఉంటే కలిగే నష్టాలను వివరించారు. మనిషికి ఉప్పు ఎంత అవసరమో వివరంగా తెలిపారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఏటూరునాగారం : మండలంలో బాస రాములు, వావిలాల రాధిక, దబ్బగట్ల భాస్కర్ ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు వారి నాయకులతో ఒక్కో కుటుంబానికి సోమవారం రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట గడదాసు సునీల్‌కుమార్, తుమ్మ మల్లారెడ్డి, ప్రదీప్‌రావు, గోవింద్ నాయక్ ఖాజాపాషా, తాడూరి రఘు, కాకులమర్రి భాస్కర్‌రావు, వావిలాల పోశయ్య, నాగరాజు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

టేకుమట్ల: మండలంలోని మందలోరిపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీని సోమవారం మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెల్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా బూర్గుల కొమురయ్య, ఉపాధ్యక్షుడి బండి రాజారాంను నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి(ఎస్ఎం)లో..

భూపాలపల్లి రూరల్: మండలంలోని కొత్తపల్లి (ఎస్ఎం) కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ గ్రామ ఇన్‌చార్జ్‌లు రఘునాథరెడ్డి, సంపత్‌రావు తెలిపారు. అధ్యక్షుడిగా అజయ్, ఉపాధ్యక్షుడిగా విష్ణు, నదీం, ప్ర ధాన కార్యదర్శిగా పాలిత రాజును ఎన్నుకున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఆరుగురిపై కేసు నమోదు

ములుగు : ములుగు మార్కెట్ రోడ్డులోని పైడిమల్ల మొగిలి ఇంటి పక్కన కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న దొంతి రవి, వలపదాసు శ్రీధర్, ఎండీ పాషా, శ్రీరాం రవి, రాయల ప్రకాశ్, పైడిమల్ల మొగిలిలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 92 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేశామని అన్నారు.

అభినందన

భూపాలపల్లి రూరల్: ఏయిమ్స్ న్యూఢిల్లీ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ పీజీ ఎంట్రెన్స్ 2025 ఫలితాలలో పట్టణానికి చెందిన ఎంపటి కుశ్వంత్ ఆల్ ఇండియా తొమ్మిదో ర్యాంకు సాధించాడు. సోమవారం బీసీ సంఘం నాయకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో కుష్వంత్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి చిన్నప్పుడే మృతి చెందిన తల్లి అనిత మిషన్ కుట్టుకుంటూ ఇద్దరి బాబులను చదివించారన్నారు. 2019లో ఎంబీబీఎస్ సీటు సాధించినప్పుడు సింగరేణి కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం కుష్వంత్‌కు ఆర్థిక సాయం చేసి ఎంబీబీఎస్ పూర్తయ్యేందుకు సహకరించినట్లు తెలిపారు.

రోడ్లపైనే వారాంతపు సంతలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు


జగన్నాథపురంలో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న సంత

వాజేడు : మండలంలో వార సంతలు (అంగళ్లు) రహదారులపైనే నిర్వహిస్తున్నారు. ప్రజలు కూరగాయలు, నిత్యావసర వస్తువులను వారానికి సరిపడే అన్ని సరుకులు సంతలోనే కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుంటారు. అలాంటి సంతల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో రహదారులపైనే కొనసాగుతున్నాయి. మండలంలోని వాజేడు, పెద్దగొల్లగూడెం, జగన్నాథపురం, గుమ్మడిదొడ్డి, పేరూరు గ్రామాల్లో వార సంతలను నిర్వహిస్తున్నారు. ఒక్కో రోజు ఒక్కో ఊరిలో ఈ సంతలు నిర్వహిస్తుండడంతో ఆ గ్రామానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు సంతకు వచ్చి సరుకులను కొనుగోలు చేసుకొని వెళ్తారు.

తప్పని తిప్పలు

వారం వారం నిర్వహించే సంతకు వ్యాపారం చేసుకోవడానికి వచ్చే చిరు వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. సంత నిర్వహణకు సరైన స్థలం లేకపోవడంతో రహదారులకు ఇరువైపులా సరుకులను విక్రయిస్తున్నారు. సంత నిర్వహించే సమయంలో ప్రజలు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే వారు తెచ్చిన సరుకులు తడువకుండా భద్రపర్చలేక నష్టపోతున్నారు. గాలులు వీచిన సమయంలో వస్తువులు చెల్లాచెదురు కాకుండా రక్షించుకోవడం తలకుమించిన భారం అవుతోంది. తమకు ప్రత్యేకంగా ఒక స్థలం కేటాయించి వ్యాపార సముదాయాలను నిర్మించి ఇస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


వాజేడులో రహదారిపై నిర్వహిస్తున్న సంత

లైట్ల వెలుతురులోనే వ్యాపారం

మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో సంతల్లో వ్యాపారం సాయంత్రం సమయంలో నిర్వహిస్తారు. చాలా మంది కూలీ పనులకు వెళ్లి వచ్చిన తర్వాత సంతకు వస్తుంటారు. మండలంలోని సంతల్లో సాయంత్రం 5 గంటల తర్వాత వ్యాపారాల నిర్వహణ కొనసాగుతోంది. రాత్రి 8 గంటలు దాటే వరకు కూడా ప్రజలు కూరగాయలు, సామగ్రిని కొనుగోలు చేస్తారు. ఆ సమయంలో వీధిలైట్ల వెలుతురులో వ్యాపార నిర్వహణ కొనసాగుతుంది. ఒక వేళ విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడితే సెల్ లైట్ల వెలుతురులో వ్యాపారాలు సాగుతాయి. అధికారులు స్పందించి సంతల నిర్వహణకు స్థలాలు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

'చలో వరంగల్'ను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

- ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ

గోవిందరావుపేట: ఈ నెల 31న వరంగల్ నగరానికి పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వస్తున్నందున హలో మాదిగ చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డి.రామకృష్ణ అన్నారు. మండలంలోని పస్రా గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు పసుల భద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రామకృష్ణ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకొని ఈ నెల 31న వరంగల్ నగరానికి ఢిల్లీ నుంచి వస్తున్న మంద కృష్ణ మాదిగకి ఘన స్వాగతం పలకడానికి ఎమ్మార్పీస్, అనుబంధ సంఘాల శ్రేణులు జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ఉదయం 10 గంటలకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు తరలిరావాలని అన్నారు. కార్యక్రమంలో ఇరుగు పైడి, శ్యాంబాబు, నరసయ్య, కరణాకర్,బలరాం, రమేష్, రాంబాబు, మొగిలి, సాంబయ్య, రంజిత్, సురేష్ పాల్గొన్నారు.

అధ్యక్ష పీఠంపై ఆశావహుల్లో ఉత్కంఠ

- తమకే అంటున్న బీసీ నాయకులు
- మండలం నుంచి 15 మంది పోటీ

మంగపేట : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ని బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్ఠానం మండల పార్టీ అధ్యక్షుల స్థానాలను నూతనంగా భర్తీ చేయనున్న సమయం రోజు రోజుకు దగ్గర పడుతుండటంతో అధ్యక్ష పదవికోసం పోటీలో ఉన్న ఆశావహుల్లో ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. అధ్యక్ష పీఠం కోసం మండలం నుంచి 15 మంది పోటీలో ఉన్నారు. పదవిని దక్కించుకునేందుకు ఒక్కొక్కరు ఒక్కో తీరు తమదైన శైలిలో పావులు కదుపుతున్నట్లు సమాచారం. కాగా అధ్యక్ష పదవికోసం పోటీలో ఉన్న కొందరు నేతలు గతంలో టీడీపీలో పనిచేసిన వారు కావడంతో ప్రస్తుత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క టీడీపీలో ఉన్న సమయంలో ఆమెకు అత్యంత సన్నిహితులుగా, రాజకీయంగా అండగా నిలిచిన కొందరు ప్రముఖులను కలిసి ఎలాగైనా తమకు అధ్యక్ష పదవిని ఇప్పించాలని ప్రాధేయ పడినట్లు సమాచారం.

బీసీ సామాజికవర్గం నుంచి నలుగురు పోటీ

ఇదిలా ఉండగా పార్టీ అధ్యక్ష పీఠం కోసం బరిలో ఉన్న 15 మందిలో బీసీ సామాజిక వర్గానికి చెందిన నలుగురు పోటీ పడుతున్నారు. 30 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి వివిద సామాజిక వర్గాలకు మాత్రమే దక్కింది తప్ప బీసీలకు కేటాయించలేదు. మండలంలో 65 నుంచి 75 శాతం వరకు ఉన్న బీసీలకు ఈ సారి పార్టీ అధిష్టానం మండల అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తుదని బీసీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొదటి నుంచి బీసీ సామాజిక వర్గం నాయకులు పదవులకోసం కాకుండా పార్టీ అభివృద్ధి, అధిష్టానం నిబంధన మేరకు క్రియాశీలకంగా పనిచేశారని దీన్ని పార్టీ అధిష్టానం పరిశీలించి పార్టీలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న సీనియర్ బీసీ నాయకుడిని మండల పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తారని ఆశాభావం వ్యకం చేస్తున్నారు.

వివిధ వర్గాల నుంచి 13 మంది పోటీ

వివిధ సామాజిక వర్గాల నుంచి 13 మంది, బీసీ సామాజిక వర్గం నుంచి చెరుపల్లికి చెంది ముత్తినేని ఆదినారాయణ, రాజుపేటకు చెందిన చందర్లపాటి శ్రీనివాసరావు, కోమటిపల్లికి చెందిన కారుపోతుల నరసయ్యగౌడ్, కమలాపురం గ్రామానికి చెందిన పెద్ది నర్సింహారావు పోటీలో ఉన్నారు. అధ్యక్షుడి నియామకంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంపై మండలంలో కాంగ్రెస్ భవితవ్యం, జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడనుండటంతో మండల పార్టీ అధ్యక్షుడి ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ పరిస్థితి నెలకొంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

కాటారం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో నెల రోజులుగా అథ్లెటిక్ శిబిరం నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందుతున్న జూనియర్, సబ్ జూనియర్ స్థాయి క్రీడాకారులకు సోమవారం అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మాజీ ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్ పులిహోర, వాటర్ బాటిల్స్, పండ్లు పంపిణీ చేశారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడా నైపుణ్యతను పెంపొందిచుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.


పులిహోర ప్యాకేట్లు అందజేస్తున్న నాయకులు

మొరం తవ్వకాలు నిలిపేయాలి

రేగొండ: మండలంలోని రావులపల్లిలో లంబాడి కుంటలో మొరం అక్రమ తవ్వకాలను నిలిపేయాలని రావులపల్లి ఎస్సీ కాలనీవాసులు తహసీల్దార్ శ్వేతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా కొంత మంది వ్యక్తులు మొరాన్ని అక్రమంగా అమ్ముకుంటూ చెరువు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. చెరువులో భారీ గుంతలు తీయడంతో ప్రమాదాలు సంభవించే అవకాశముందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెండెల రవి, రత్న మల్లయ్య, మేకల పోషాలు, పెండెల చిరంజీవి, మేకల రాజు, రత్న మధు, మేకల శివ, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సమాచారం అందని వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలి

వాజేడు : రాజీవ్ యువశక్తి పథకానికి దరఖాస్తు చేసుకున్న చాలా మంది సమాచారం లోపం కారణంగా ఇంటర్వ్యూలకు హాజరు కాలేదని వారికి మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక కోసం సోమవారం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు పత్రిక ప్రకటన, గ్రామ పంచాయతీలో లిస్టు పెట్టడం లాంటివి ఎంపీడీఓ చేయకపోవడంతో చాలా మంది అభ్యర్థులకు విషయం తెలియలేదన్నారు. ఈ కారణంగా చాలా మంది అభ్యర్థులు హాజరు కాలేకపోయినట్లు ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారో అనే సమాచారం సైతం లేక పోవడంతో సాయంత్రం రావాల్సిన వారు ఉదయం నుంచే ఎంపీడీఓ కార్యాలయం వద్ద పడిగాపులు పడ్డట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారిని ఇంటర్వ్యూలకు పిలుస్తున్న అధికారులు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను చేసుకున్న వారికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. సమాచార లోపం కారణంగా ఇంటర్వ్యూలకు రాలేకపోయిన వారికి, ఆఫ్ లైన్లో దరఖాస్తులు చేసుకున్న వారికి మరోసారి పక్కా సమాచారం ఇచ్చి ఇంటర్వ్యూ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

- పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్


రోలుబండలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

వెంకటాపురం(ఎం): రాబోయే వర్షాకాలంలో తగు జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చీర్ల శ్రీకాంత్ గొత్తికోయలకు సూచించారు. సోమవారం మండలంలోని తౌ్రిచింతలపాడు, రోలుబండ గొత్తికోయగూడేల్లో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 62 మంది గొత్తికోయలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గర్భిణులకు, పిల్లలకు టీకాలు వేశారు. అనంతరం గొత్తికోయలతో డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి ద్వారా మలేరియా, డెంగీ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. వర్షాకాలంలో కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నవీన్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మోతీలాల్, ఏఎన్ఎంలు అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, ఇందిర, కవిత, సంపూర్ణ, శోభ పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్


టీజేఎఫ్ వజ్రోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లెనిన్, నాయకులు

ఏటూరునాగారం : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఎంతో కీలకంగా పనిచేసిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఏర్పడి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 31న హైదరాబాద్ జలవిహార్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని అరుణ కన్వెన్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే -హెచ్ 143 ములుగు జిల్లా కన్వీనర్ దూడబోయిన రాకేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం లెనిన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలకంగా ములుగు జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు పనిచేశారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అక్రిడిటేషన్ కార్డులను గతంలో కంటే ఐదు రెట్లు ఎక్కువగా పెంచుకున్నామన్నారు. మనమంతా ఐక్యంగా ఉండాలని కోరారు.

సమన్వయ కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం సబ్ డివిజన్ సమన్వయ కమిటీని ప్రకటించారు. ములుగు జిల్లా కో కన్వీనర్లుగా ఎండీ.అఫ్జల్, నూక ప్రభాకర్, బాచినేని ప్రవీణ్, వసంత రమేష్, సభ్యులుగా అలువాల శ్రీనివాస్, జూపాక కృష్ణ, వేమ సురేష్, ఎండీ ఇషాక్, పసుపులేటి సతీష్, పాషా, కలకోట సంతోష్, బేతంచర్ల అశోక్, పర్వతాల లాలయ్య, గంట సర్వేశ్వరరావు, ఠాకూర్ ప్రతాప్, చల్లగొండ శ్రీకాంత్ రెడ్డి లను నియమించారు. కార్యక్రమంలో బోడ సత్యం, గోపి, సుధాకర్, మహేష్, మల్లేష్, షాయక్, తిరుమల్, రమేష్, సాయి, సురేష్, దామోదర్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వైవీఎస్ సర్టిఫికెట్ల సంయుక్త పరిశీలన

గోవిందరావుపేట : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకానికి మండల వ్యాప్తంగా 2188 దరఖాస్తులు వచ్చాయి. రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న వారి సర్టిఫికెట్లను సోమవారం ఎంపీడీఓ జవహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్ స్వామి, బీసీ కార్పొరేషన్ ఈడీ రవీందర్ రెడ్డిలు సంయుక్త పరిశీలన (జాయింట్ స్క్రీనింగ్) నిర్వహించారు. మండలంలో రెండు బ్యాంకులు ఎస్‌బీఐ గోవిందరావుపేట శాఖ, టీజీబీ పస్రా శాఖ ఖాతాదారులు మొత్తం 2188 దరఖాస్తులు చేసుకోగా సోమవారం ఎస్‌బీఐ శాఖ కింద వచ్చిన 1101 మంది దరఖాస్తులదారులకి సంయుక్త పరిశీలన చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కింద వచ్చిన మరో 1087 మంది దరఖాస్తులను మంగళవారం పరిశీలించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీఓ మమత, సీనియర్ అసిస్టెంట్ ఇక్బాల్, పంచాచతీ కార్యదర్శులు దేగల శంకర్, అశోక్, చుంచు భారతి పాల్గొన్నారు.


దరఖాస్తుదారులకు సూచనలు చేస్తున్న అధికారులు

'రాజీవ్ యువ వికాసం' ఇంటర్వ్యూలు

ఏటూరునాగారం: రాజీవ్ యువ వికాసం స్కీంకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ప్రజాపరిషత్ కార్యాయంలో ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కాగా మండలంలోని ఏటూరునాగారం, అల్లంవారిఘణపురం, చెల్పాక, రొయ్యూర్, ముళ్లకట్ట, శంకరాజుపల్లి గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఎస్బీఐ అధికారులు సిబ్బంది స్క్రీనింగ్ టెస్ట్ ను ప్రక్రియ నిర్వహించారు. అయితే, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ ఈ ప్రక్రియను పరిశీలించారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం(ఎం): ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు ని ర్వహించారు. ములుగు తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలో 301 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ అభ్యర్థులకు, ఇంచర్ల ఎస్‌బీఐ పరిధిలో 372 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మంగళవారం ఎస్‌బీఐ గణపురం, వెంకటాపురం టీజీబీ పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వాజేడు: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండల వ్యాప్తంగా 1700 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 1100 మందిని అర్హులుగా నిర్ధారించారు.


వెంకటాపురం(కె) : అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో రాజీవ్ యువశక్తి పథకం లోన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. బ్యాంక్‌లో ఎస్టీ అభ్యర్థులు 309 మంది దరఖాస్తు చేసుకోగా 188 మంది, ఎస్సీ 187 మంది దరఖాస్తు చేసుకోగా 129 మంది, బీసీలు 229 దరఖాస్తు చేసుకోగా 166 మంది, ఈబీసీ, మైనారిటీ అభ్యర్థులు 9 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

నేడు, రేపు రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు

ములుగు : రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలకు దరాఖాస్తులు చేసుకున్న అ భ్యర్థులకు నేడు(మంగళవారం) జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. 27న కెనరాబ్యాంకు, 28న యూబీఐ, ఎస్బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు ఉంటాయని అన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.


ఏటూరునాగారం: రాజీవ్ యువవికాసం స్క్రీనింగ్‌కు హాజరైన శ్రీనివాస్


వెంకటాపురం(ఎం) : అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు


వాజేడు: ఇంటర్వ్యూ కోసం క్యూలైన్లో ఉన్న అభ్యర్థులు

అన్నదానం చేయడం అభినందనీయం

భూపాలపల్లి రూరల్: కాళేశ్వరంలో నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్లే భక్తులకు దాతల సహకారంతో భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద వరుసగా పన్నెండు రోజుల పాటు అన్నదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం అన్నదాన శిబిరంలో పాల్గొన్ని భక్తులకు ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నదానానికి సహకరించిన దాతలకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పట్టణ పరిధిలోని వేశాలపల్లిలో ఏర్పాటు చేసిన జైబాపు,జైభీం, జైసంవిధాన్ కార్యక్రమంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, ఆకుల మహేందర్, రాంనేని రవీందర్. తోట రంజిత్, ముంజాల రవీందర్, గురిజాల రవి పాల్గొన్నారు.